# కర్తవ్యం

నామని సుజనాదేవి

సంధ్యాకాంత పసుపు, ఎరుపు కలిసిన పారాణి రంగు చీర ధరించి, ఎర్రగా మెరుస్తున్న సూర్యుణ్నీ సింధూరంగా దిద్దుకుని, మేఘాల మేలి ముసుగును సవరించుకుంటూ పిల్ల తెమ్మరలే అందెల రవళిగా పశ్చిమానికి పయనమయింది. గూట్లోకి చేరుకుంటున్న పక్షుల కిలకిలారావాలు చీకటిపడింది – ఇల్లు చేరండని అందరినీ హెచ్చరిస్తున్నట్లుగా ఉన్నాయి.

ప్రకృతిని ఆస్వాదిస్తున్న నీలిమ అసహనంగా వాచ్ చూసుకుంది. ఆరున్నరవుతోంది. చలి కాలం కాబట్టేమో సంధ్యాచీకట్లు ముసురుకున్నాయప్పటికే. తానుండే వర్కింగ్ ఉమెన్ హాస్టల్‌కి దూరం కాబట్టి, ఈ పార్క్‌కి రానని ఎంత చెప్పినా వినలేదు వినోద్. ఈరోజు తన పుట్టినరోజు కాబట్టి వాళ్ల ఊరు వెళ్లి సాయంత్రం ఐదు గంటలకొచ్చేస్తానన్నాడు. గంటవుతోంది. ఇంకా రాలేదు. అసలెవరన్నారు... నిరీక్షణ ఎంతో మధురమని? తనకు మాత్రం క్షణమొక యుగంగా నడుస్తోంది. ఫలించిన నిరీక్షణ మధురంగా ఉంటుందేమో! ఆలోచనల్లో ఉన్న ఆమెకు తెలియదు... ఈ రోజు ఈ విధంగా రావటం వల్లే తన జీవితం అనూహ్యమైన మలుపు తిరగబోతోందని, తనో దారుణాన్ని ఎదుర్కోబోతోందనీను.

ఒంటరిగా ఉండబట్టేమో అప్పటికే అటుగా వెళ్తున్నవాళ్లు అనుమానంగా చూసుకుంటూ వెళ్తున్నారు. హాస్టల్‌కెళ్లే దారిలో వీధిదీపాలు కూడా ఉండవు. రోడ్ నుంచి లోపలకు కనీసం ఒక కిలోమీటర్ నడవాలి. ఏడు, ఎనిమిదయితే ఆ బాటగుండా జనసంచారం కూడా ఉండదు. అసలు ఈ విషయం అప్పుడే వినోద్‌తో అంటే 'డోంట్ ఫియర్... మైడియర్... అయామ్ హియర్...' అంటూ నాటక ఫక్కీలో అంటూ 'నే తోడొస్తాగా' అన్నాడు. ఏదీ... ఇంతవరకూ జాడలేదు. ఛ... ఈ మగవాళ్ల మాటలసలే నమ్మొద్దు. ఇక లాభం లేదనుకుని నడుచుకుంటూ బస్టాప్ కొచ్చింది. ఆటోలు లేవు. బస్ దొరికి తన స్టాప్‌లో దిగేసరికి ఎనిమిదిన్నర అయింది. అక్కడి నుండి హాస్టల్‌కి కనీసం పావుగంట నడకయినా పడుతుంది. వేరే సవారీ ఉండదని అటువైపు ఆటోలు కూడా రావు.

త్వరత్వరగా అడుగులు వేస్తూ నడుస్తోంది నీలిమ. వినోద్ ఆలోచనలలో పరధ్యానంగా ఉన్న ఆమె వెనక టకటకమంటూ వినిపించిన బూట్లశబ్దానికి భయంగా వెనక్కి చూసింది. రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది. ఎవరూ లేరు కానీ వెనుక మాత్రం బూట్లశబ్దం లయబద్ధంగా వినబడుతోంది. మరీ నిశ్శబ్దంగా ఉండటం వల్లనేమో... ఆ శబ్దం మరీ భయంకరంగా, భీతిగొల్పేలా వినబడుతోంది. వెనుదిరిగి చూస్తే తను భయపడుతున్నట్లు తెలుస్తుందేమోనని, నడక వేగం పెంచింది. వెనకాల కూడా నడక వేగం పెరిగినట్లు బూట్లశబ్దం తెలియజేయడంతో ఆమె గుండెవేగం పెరిగింది. వెనుదిరిగి చూసింది. ఎవరో ఒక వ్యక్తి... స్పష్టంగా ముఖం కనబడటంలేదుగాని, దృఢంగా, మొరటుగా, రఫ్‌గా కనబడుతున్నాడు. పరిగెత్తడం మొదలు పెట్టింది. ఇదంతా సినిమాలో చూసిందిగాని, నిజజీవితంలో ఆమె ఊహించలేదు. [illegible]



కధా నిలయం

త్ర్యం వచ్చి షష్టిపూర్తి సంవత్సరం దగ్గరకు వస్తోంది కాబట్టి బాపూజీ కలలు కన్నట్లు 'అర్ధ రాత్రి ఆడది క్షేమంగా నడివీధిలో నడచివచ్చే రోజు వచ్చేసింది' అనుకుంది ఆమె. మరో ఇదారు నిమిషాల్లో హాస్టల్ వచ్చేస్తుందని ధైర్యం చిక్కబట్టుకుంటూ అందరు దేవుళ్లనూ మొక్కుకుంది. కానీ ఏ దేవుడూ ఆమె మొర వినిపించుకోలేదు. అతని వేగం ముందు ఆమె పరుగు నిలువలేకపోయింది. పరిగెత్తుకొచ్చి ఒడిసి పట్టుకున్నాడు. అరవకుండా నోటికి చెయ్యడ్డం పెట్టాడు. ఎంత పెనుగులాడినా అతని ఉడుంపట్టు నుంచి అంగుళం కూడా విడిపించుకోలేక పోయింది. చెట్ల చాటుకు లాక్కెడుతుండగా స్పృహ తప్పిందామెకు.

రాత్రి పదకొండు గంటలకు పెట్రోలింగ్ వ్యాన్ వచ్చి, అస్తవ్యస్తంగా పడి ఉన్న ఆమెను ఆస్పత్రికి తరలించడం, వివరాలు తెలుసుకుని, హాస్టల్ వారిని పిలిపించడం వెంటవెంటనే జరిగిపోయాయి. తెల్లవారి హాస్టల్‌లోని వారికందరికీ తెలియడం, సానుభూతి కురిపించడం, పోలీస్ రిపోర్టివ్వడం అంతా జరిగింది. 'అబల పై అత్యాచారం' అనే వార్త అన్ని వివరాలతో, అన్ని పత్రికలలో రావటంతో ఇంకా ఆ వార్త తెలియని వారందరకూ కూడా తెలిసింది.

గుండెను రంపంపెట్టి కోస్తున్నట్లుంది నీలిమకు. చైతన్యవంతమైన జీవితం ఒకేసారి స్తబ్ధమైన భావన. రంగుల కల ముక్కలయిన ఆవేదన. ఏడు వర్ణాల ఇంద్రధనుస్సు కళ్లముందే వివర్ణమై మీదకూలిన వేదన. ప్రపంచం అంతా తనని చూసి నవ్వుతూ వికటాట్టహాసం చేస్తున్నట్లు, ప్రపంచంలో తనకెవరూ లేనట్లు... ఒంటరిదైపోయినట్లు... ఆ క్షణంలోనే భూమి పగిలి అందులో కూరుకుపోతే బావుండుననే ప్రగాఢమైన కోరిక. చిన్నప్పుడే తల్లీ, తండ్రీ పోవడంతో ఆస్తికోసం, పదుగురికోసం ఏదో చదివించాలని... హాస్టల్‌లో పడేసి చేతులు దులుపుకున్న మేనమామ ఓదార్చకపోగా, వంశానికి అపకీర్తి తెచ్చావంటూ తిట్లతో, ఇంటికి రావద్దంటూ అల్టిమేటం ఇచ్చి వెళ్లడంతో మనస్సంతా మొద్దుబారి పోయింది నీలిమకు. హాస్టల్ పేరు బయటకు వచ్చి అందరి నోళ్లలో నానుతున్నందున వార్డెన్ రూమ్ ఖాళీ చేయమని గోలపెడుతోంది. ఏడ్చీఏడ్చీ ఏడుపుకూడా రావడం లేదు నీలిమకు. జరిగిన సంఘటన తాలూకు విషాదం, ఆవేదన, అశక్తత ఒక ఎత్తయితే, దాని వివరాలు పోలీసులు, చుట్టు పక్కలవారూ అడుగుతూ మానసిక హింస పెట్టడం మరో ఎత్తు. కళ్లముందు ఇంకా తాజాగా ఆ సంఘటన జరిగినట్లు గుర్తొచ్చి గుండెను మెలిపెడుతోంది. మనస్సును వణికిస్తోంది. తనకే శక్తి ఉంటే, అదేదో సినిమాలో (ఘటోత్కచుడు) లా కాలచక్రాన్ని వెనక్కి తిప్పినట్లు ఒక్కసారి తిప్పితే ఎంత బాగుండు? అనుకుంది. ఆ ఒక్కరోజు తాను కాస్తంత ముందు బయల్దేరినా, వెళ్లకుండా ఉన్నా, వినోద్ పిలవకుండా ఉన్నా లేక వినోద్ వచ్చినా ఈ సంఘటన జరగకుండా ఉండేదేమో! అసలు ఆ రోజు అలా వెళ్లకుండా వేరేవిధంగా జరిగితే ఎంత బావుండు... అని వందసార్లు అనుకుంది. కానీ ఏం లాభం... అతి పురాతనమయినది, అత్యాధునికమైనది, అత్యంత శక్తివంతమయినది, ఎవరి చేతుల్లోనూ లేనిది, ఎవరి మాటా విననిది, మార్పులు చేయడానికి అసాధ్యమయినది, తిరిగి రానిది కాలమట. ఆ ఒక్కక్షణం వెనక్కిపోతే ఎంత బావుండు... ఇప్పుడు వగస్తే ఏం లాభం...? జరిగిపోయిన తప్పును సరిదిద్దలేం కదా!

అసలు మగవాడి దౌష్ట్యానికి అంతమే లేదా? ఏ రోజు పేపర్ అయినా ఒక అత్యాచారం

వార్త అయినా లేకుండా వస్తుందా? ఎందుకిలా జరుగుతోంది? పిల్లల మానసిక పరిస్థితులు, చుట్టూ పెరిగిన వాతావరణం, సినిమాలు... వాటి ప్రభావాన్ని యువతరంపై బాగా చూపెడుతున్నాయి. మొన్నటికి మొన్న తన కొలీగ్ మాలతి వాళ్లింటికెళితే, దాని పాప ఏమంది? అబ్బబ్బా... జ్వరమొచ్చి రెండురోజులు స్కూల్కి వెళ్లకపోతే..., ఫోన్ చేసి బాయ్‌ఫ్రెండ్సంతా నా ప్రాణం తీస్తున్నారాంటీ... ఒకసారయినా వచ్చి వెళ్లమంటున్నారు...' అంటూ విసుగ్గా అంటుంటే తనెంత ఆశ్చర్యపోయింది? ఇంతకీ అది చదువుతున్నది యూకెజీ. ఇదే మరెవరన్నా అంటే తాను నమ్మకపోయేది. మరీ విడ్డూరం కాకపోతే... ఇంత ఎక్స్‌ట్రాలా...? అనుకునేది. నేటి సినిమాలు ఎంత ఘోరంగా ఉంటున్నాయి? సకుటుంబ సమేతంగా వెళ్లేవి ఒక్కటయినా ఉంటున్నాయా? పిల్లలకు నీతి, మంచి, చెడు విచక్షణ తెలిపే పుస్తకాలవైపు ఎవరైనా శ్రద్ధ చూపెడుతున్నారా? ఇది లేకపోవటం వల్లే పత్రికల్లో పట్టుమని పదేళ్లయినా, అయిదేళ్లయినా లేని బాలికలపై అత్యాచారాలు, వావివరసలు మరిచిన కామాంధులు, తాగుబోతులు అన్న వార్తలు. వ్యాపార ప్రకటనల్లో, సినిమాల్లో స్త్రీని ఎంత నీచంగా చూపెడుతున్నారు? 'యత్ర నార్యంతు పూజ్యతే... రమంతే తత్ర దేవతా' అని ఆర్యోక్తి. పూజించడం మాట ఎలా ఉన్నా కనీసం గౌరవించడం తెలీదే! బస్‌లో 'స్త్రీలను గౌరవించడం మన సంప్రదాయం... వారికి కేటాయించిన సీట్లలో వారినే కూర్చోనిద్దాం' అని తాటికాయంత అక్షరాలతో రాసి ఉన్నా, మహిళలు వస్తే ఎంతమంది లేచి సీటు ఇస్తున్నారు?

అసలు అత్యాచారం జరిగిన బాధ ఒకవైపయితే, తర్వాత లోకం చూసే చూపులు, సూటీపోటీ మాటలూ భరించడం మరోవైపు. 'ఏంటో... జరిగిందంతా మంచిపనని... తగుదునమ్మా అని పోలీసు రిపోర్టిస్తుందా...' 'అంత రాత్రివరకెవరితో షికారుకు వెళ్లిరావాలో... ఈడొచ్చిన పిల్ల త్వరగా ఇల్లు చేరాలని తెలీదూ?...' ఇలా 'నరంలేని నాలుక' ఏమైనా మాట్లాడుతుందన్నట్లు పలురకాల వ్యాఖ్యానాలు. ఎందుకో తనకు ఈ లోకం నుండి ఎవరూలేని ఏకాంత ప్రదేశానికి వినోద్‌తో కలిసి ఎగిరి వెళ్లాలనుంది. కేవలం అతని ధృఢమైన చేతులే తనను అక్కున చేర్చుకుని ఈ సానుభూతుల పరంపర నుంచి సేదతీరుస్తాయి. తనలో మళ్లీ కొత్త ఆశల్ని, ఉత్సాహాన్నీ నింపుతాయి. ఇదివరకటి ప్రశాంత, చైతన్య జీవనాన్ని తెస్తాయి. అవునూ... తానింత ఆత్రంగా క్షణమొక యుగంలా ఎదురుచూస్తూంటే ఇంకా వినోద్ రాడేంటి...? 'నీ ప్రపంచమంతా నా చేతుల మధ్యనే అంటూ తనలో నన్ను దాచుకోడేం...? అసలు తనని తాను ఎంతో పవిత్రంగా అతనికి అర్పించుకుందామనుకుంది. ఎన్ని కలలు కంది? ఛ... క్షణంలో తన ఊహా ప్రపంచమంతా తలక్రిందులైంది. వినోద్‌కేమైంది? ఊరినుండి వచ్చాడా? తను లేకుండా క్షణమైనా ఉండలేనంటూ, 'నిను చూడకనేనుండలేను...' అంటూ పాడేవాడు. ఇపుడెలా ఉండగలుగుతున్నాడు? వచ్చాక ఈ విషయం తెలిస్తే ఏమంటాడు?... తను ఏడుస్తూంటే చూడగలడా? 'నీకు నేను లేనూ' అంటూ ఓదార్చడూ! త్వరగా వినోద్ వస్తే బావుండు. ఈ బాధలన్నీ మర్చిపోయి అతన్ని పెళ్లి చేసుకుని మాది ఆదర్శ వివాహం అంటూ అందరికీ తెలియజెప్పాలి అనుకుంటూ త్వరగా తయారయి బయటకొచ్చి వినోద్ ఆఫీస్‌కి ఫోన్ చేసింది.

వినోద్‌వచ్చి రెండురోజులయ్యిందని, ఆఫీస్

కి వస్తున్నాడని, ఇప్పుడే టీ కోసం వెళ్లాడనీ చెప్పారు. ఆశ్చర్యం అనిపించింది. తననెందుకు కలవలేదు? ఇంక ఆగబుద్ధి కాలేదు నీలిమకి. వెంటనే ఆటోలో ఆఫీస్ దగ్గర దిగింది. అటెండర్‌కి తను బాగా తెలుసు. తనని చూడగానే 'వినోద్ బాబుగారామ్మా... లోపలున్నారు... పిలుస్తాను కూర్చోండి...' అంటూ వెళ్లాడు.

కాసేపటి తర్వాత నెమ్మదిగా అతనొక్కడే వచ్చి 'ఆ... మరే... అయ్యగారు లేరమ్మా' అంటూ త్వరత్వరగా వెళ్లిపోయాడు. తనకు 'ఇంతకుముందు ఉన్నారన్నావు కదా!' అని అడిగే అవకాశమివ్వకుండా. అసలిదంతా నిజంగా అనిపించలేదామెకు. 'నీవు లేక నేను లేను... నేను లేక నీవు లేవు...' అని పాడుతూ తన వెనకాల తిరిగే వినోదేనా ఇలా అంటున్నది. ఇన్నిరోజులు కలవకుండా ఎలా ఉండగలిగాడు?

'అందరి గుండె 'లబ్ డబ్' అని కొట్టుకుంటూంటే నా గుండె మాత్రం 'నీలూ... నీలూ...' అని ఎలా కొట్టుకుంటూందో చూడు' అనే వినోదేనా ఇలా ముఖం చాటేస్తున్నది? ఒక్క రోజు ఊరికెళితే, 'అబ్బా!... 24 గంటలు, 1440 నిమిషాలు, 86,400 సెకన్లు నిన్ను చూడకుండా ఉండటం నా వల్ల కాదు' అనే అతనే, ఆఫీస్‌లో ఉండి లేడనిపించడం... దూరం నుంచి పొరబాటున తను కనబడినా మొహం చాటేసుకుని వెళ్లిపోవడం చూసాక, 'అందరి మగవాళ్ల నైజానికీ ఇతను ఏమీ మినహాయింపు కాదు' అన్న నిజాన్ని జీర్ణించుకోవడానికి నీలిమకి కొంత కష్టమే అయింది. 'మిణుకు... మిణుకు...' మంటున్న ఆశ కాస్తా అణగారిపోయింది. ఏడ్చీ... ఏడ్చీ... విసిగిన కళ్లు ఇక ఏడవటం తమ వల్ల కాదంటున్నాయి. బాధపడిన గుండె ఇంక ఓపికలేదంటోంది.

ఆ రోజు బాగా ఆలోచించి ఒక దృఢనిశ్చయంతో సరాసరి ఆఫీస్‌లోని వినోద్ సీట్ దగ్గరికెళ్లింది నీలిమ. వర్క్ చేసుకుంటున్న అతనితో, 'ఎక్స్‌క్యూజ్ మి' అంది. ఉలిక్కిపడి... తలెత్తిన వినోద్, ఆమెను చూసి గతుక్కుమని పట్టుబడ్డట్టుగా, తడారిన గొంతుతో 'హలో' అన్నాడు ఇబ్బందిగా, తప్పనిసరి తద్దినమన్నట్లుగా!

'ఒక్క నిమిషం మీతో మాట్లాడాలి. అలా బయటకువస్తారా?' అన్న నీలిమతో తప్పదన్నట్లు సెక్షనాఫీసరుకి చెప్పి బయటకు నడిచాడు.

ప్రక్కనే ఉన్న పబ్లిక్‌గార్డెన్‌లోకి నడుస్తున్న ఆమెను మౌనంగా అనుసరించాడు వినోద్. ఎవరూలేని చోట కూర్చుని, 'కూర్చోండి' అంది నీలిమ. అప్పటికయినా ఆ రోజు ఎందుకు ఆలస్యమయిందీ..., తర్వాత తనకు తెలిసిన సంగతి గురించో, తన అభిప్రాయం గురించో చెబుతాడని కొన్నిక్షణాలు మౌనంగా ఉందామె. అసలు అంతకుముందు ఇలా ఖాళీగా కూర్చునేవాడా?... ఎన్ని చిలిపిమాటలు... క్షణక్షణం నవ్వుతూ నవ్విస్తూ ఉండేవాడు. ఇప్పుడేదో బలమైన కోటగోడ ఇద్దరిమధ్యా ఉన్నట్లు చాలా ఇబ్బందిగా కూర్చున్నాడు. కేవలం ఒక వారం రోజుల తేడా తమ జీవితాలను ఎంతెలా మార్చేసింది? తన తప్పేమీ లేకపోయినా... తన జీవితంతో విధి ఎలా ఆడుకుందీ?... వారం క్రితం ఇదేచోట కూర్చుని ఎంత సంతోషంగా ప్రపంచమే తమదన్నట్లు ఎన్ని కబుర్లు చెప్పుకున్నారు? అప్పుడనుకున్నారా... తామిద్దరూ ఇలా అపరిచితుల్లా కూర్చోవాల్సి వస్తుందని? ఇదే విధివిలాసమేమో... కాలం మహత్యమేమో తనలో ఆ రోజు, ఆ తెల్లవారి ఉన్నంత నిరాశ నిస్పృహలు లేవు. ఇంకా మాట్లాడటం లేదన్నట్లు

ఇబ్బందిగా వినోద్ గొంతు సవరించుకున్నట్లు దగ్గటంతో ఆలోచనల్లో నుండి ఇహలోకంలో కొచ్చింది నీలిమ.

'చూడండి... మిస్టర్ వినోద్... జరిగిన సంఘటన మీకు తెలిసిందని మీ ప్రవర్తన చెప్పకనే చెబుతోంది. ఇప్పుడు 'పెళ్లి చేసుకోండి' అని ఎక్కడ కాళ్లావేళ్లాపడతానో... ఎలా తప్పించుకోవాలోనని అనుకుంటున్నారేమో... అంత శ్రమ మీకు అక్కరలేదు. ఎందుకంటే జరిగిన దాంట్లో నా తప్పు ఏమాత్రం లేకపోయినా నేనే ఏదో ఘోరాపరాధం చేసినట్లు మీరేదో నా కోసం త్యాగం చేస్తున్నట్లు పెళ్లి చేస్కున్నా, రేపు ఏ చిన్న తప్పు కనబడినా ఈ సంఘటన గుర్తు తెచ్చి, నన్ను అనుమానించరని ఏమిటి నమ్మకం? నేను రానన్నా ఆ రోజు తప్పక రావాలని, తోడుగా వస్తానని బలవంతం చేసింది మీరే. అంటే జరిగినదానికి పూర్తిగా అసలు మీరే బాధ్యులు. అయినా శిక్ష మాత్రం నాకు పడింది. కారణం మీలాంటి ప్రియుణ్ణి నమ్మినందుకు. కనీసం మీరు నా దగ్గరకు వచ్చి, ఇలా జరిగాక నిన్ను చేసుకోవడం నాకిష్టం లేదని నిర్మొహమాటంగా చెప్పినా సంతోషించేదాన్ని. దానికిలా ముఖం చాటేయడమెందుకు?

పోయింది తిరిగిరాని శీలమే అయినా, ఎటువంటి పరిస్థితుల్లో పోయిందో తెలిసినపుడు దానిని కేవలం శరీరానికి అంటిన బురదగా, ఒక గాయంగా ఎందుకు పరిగణించరు? అందులో నా ప్రమేయం ఏమీ లేనప్పుడు కేవలం మగవాడి దౌష్ట్యానికి బలైన ఆడపిల్ల అని ఎందుకు అందరితో సమానంగా చూడరు? అదే మగవాడు ఎందరి మానాల్ని హరించినా, అతని శీలం చెడిందని అనరెందుకని? ఆడదానికొక న్యాయం... మగవాడికొక న్యాయమా? ఇదే ఒకవేళ పెళ్లయ్యాక జరిగితే నన్ను ఒదిలేసేవారా?

సినిమాల్లో చూపినట్లు ఎవరి దౌర్జన్యానికో బలై, అయ్యో జీవితమిలా అయ్యిందంటూ ఆత్మహత్య చేసుకునే ఆడవాళ్లలా సమాజానికి భయపడే పిరికిదాన్ని కాదు నేను. అసలు చేయని తప్పుకు నేనెందుకు బలికావాలి? పైగా తప్పు చేసినవాడు దర్జాగా మీసం మెలేసుకుని మరీ తిరగడానికి, మళ్లీ ఇలాంటి తప్పులు చేయడానికి పరోక్షంగా ఎందుకు కారణం కావాలి? ఈ విషయంలో ఆడవాళ్లు సమాజానికి వెరసి, తమ భావి జీవితానికి భయపడి, ధైర్యంగా ఫిర్యాదు చేయడానికి వెనుకంజవేయడం, ఆత్మహత్యలు చేసుకోవడం ద్వారా ఇలాంటి దుర్మార్గుల దారి ఇంకా సుగమం చేయడం... దానికి కారణం నేనే కావడం నాకిష్టం లేదు. స్త్రీ ఆత్మరక్షణ పద్ధతుల గురించి శిక్షణనిస్తున్న సంస్థలో ఇప్పుడే చేరిన నేను అందరికీ దాని ఆవశ్యకత తెలియజెప్పి, ఆఫీస్ టైం తర్వాత ఉచితంగా నేర్పడానికో సంస్థను ఏర్పాటు చేస్తాను.

అన్నీ వివరంగా తెలిసి... జాలి, దయతో కాక ప్రేమతో నన్ను... నన్నుగా కావాలని పెళ్లి చేసుకోవడానికెవరైనా వస్తే అప్పుడాలోచిస్తాను పెళ్లి గురించి. అయినా పడతికి పెళ్లే పరమావధి అనుకోను. పెళ్లికి ముందే నీ ప్రేమ నిరూపణ అయినందుకు అదృష్టవంతురాల్ని. గుడ్ బై...

తన అభిప్రాయాన్ని సూటిగా చెప్పి, ఆత్మవిశ్వాసంతో నడిచి వెళ్తున్న నీలిమను గుడ్లప్పగించి చూస్తూ కర్తవ్యం స్ఫురణకు రావటంతో... 'ప్లీజ్... నీలూ... ఆగు. నన్ను క్షమించవూ...' అంటూ వెంటపడ్డాడు వినోద్.

పశ్చిమాద్రికి వెళ్తున్న సూర్యుడు ఆగిపోయాడు నీలిమ సమాధానం కోసం ఉత్సుకతతో. ●